



# ప్లాను

తులసి బాలకృష్ణ

"బిల్లు నేనిస్తా"

"కాదు — నేనిస్తాలే."

"అరె వద్రలా నేనిస్తానంటున్నానా?"

"ఫర్వాలేదులే — నేనిచ్చేస్తా— వదిలెయ్యి."

— ఆశ్చర్యపోయాను.

బుచ్చిరెడ్డి గాడేవిటే... బిల్లివ్వడమేవిటి ?! కొంపతీసి ఏ లాటరీ అయినా తగల్లేదుకదా ! వాడి జన్మలో ఎప్పుడన్నా కాఫీనీళ్ళన్నా ఎవరి కయినా పోయించి ఎరుగునా వాడు ?! మరివాళ ?!...

"ఏవిటోయ్ బుచ్చీ విశేషం ? చేతిలోంచి లాక్కుని మరీ బిల్లిస్తానంటున్నావు ?"

"ఏం లేదులేరా, ఊరికే. ఎప్పుడూ నువ్వే ఇస్తావుగా."

"అదే అంటున్నానోయ్ — ఈ వా శేం ఉపద్రవం తెచ్చిపెట్టబోతున్నావు బిల్లిచ్చి ?"

"ఛ పోరా — నీలా బాచిలర్ గాడినయితే నేనూ కనబడ్డవాడికల్లా దుక్కగా తినిపించి వుండేవాడిని. పద్దెనిమిదోఏడు తిరక్కుండానే కట్టబెట్టాడో గుదిబండని నా మెడకి మా బాబు. వరసలో పుట్టుకువచ్చేసారు నలుగురు ఆడ పిల్లలు— చావనీయకుండా బతకనీయకుండా చంపుతున్నారు నన్ను..."

"నాయనా బుచ్చీ—హేమరింగొద్దు బాబూ. నీ చరిత్ర చెప్పమన్నానా ? ఈ వేళెందుకు ఇంతటి సాహసానికి ఒడికట్టావు, ఏవిటీ తెగింపు అని మాత్రమేకదా నేనడిగింది ?"

"ఇదేకాదురా — ఈ శలవు దినం నీకు వీలయినంత ఆనందాన్ని కలిగించి గుడ్ కంపెనీ యివ్వదలుచుకున్నాను. ఇప్పుడు మనం మ్యాట్నీకి పోతున్నాం. రాత్రి డిన్నర్ హోటల్ అన్నపూర్ణలో. అన్ని ఖర్చులూ నావే."

అయ్యబాబోయ్, అయ్యబాబోయ్ ఎంత ధైర్యంగా చెప్పేస్తున్నాడూ... ఏవొచ్చిం దివాళ వీడికీ... పిచ్చిపట్టలేదుకదా...

ఆ విషయమే అడిగాను — మనిషిని కుదుపుతూ.

చిద్విలాసంగా నవ్వి, తలాడించాడు.

సినిమా, భోజనం అయ్యాక, 'మా ఇంటికోసారి వెళ్దాంనడు' అంటూ తీసుకు వెళ్లాడు. అప్పటివరకు ట్రీట్ ఎందుకు ఇస్తున్నాడో ఎంత అడిగినా చెప్పలేదు.

ఇంటినిచూసి, ఇల్లాలిని చూడమని అన్నది బుచ్చిరెడ్డి భార్యని గురించిన హెచ్చరికేనేమో. అడుగు మోపడానికి చోటులేకుండా చెల్లాచెదరుగా పడివున్నాయి సామాన్లన్నీ.

"కూర్చో" అన్నాడు.

"ఎక్కడ ?" అన్నాను చుట్టూ అయోమయంగా చూస్తూ.

ఒక కుర్చీమీది బొమ్మలు, పుస్తకాలుతీసి, ఒక పాతబట్టతో బొగ్గు మసిని తుడిచి, "ఇక్కడ." అన్నాడు.

బలవంతంమీద కూర్చున్నాను.

"బావున్నారా అన్నయ్యగారూ" అన్న కర్ణ కఠోరమైన ధ్వనికి గబుక్కున "ఆ" అని జవాబిచ్చేసి, తల దించేసుకున్నాను — కళ్లెత్తి ఆ ఆకారాన్ని చూస్తే ఇందాక తిన్న ఆహారానికి ఏదైనా ముప్పు రావొచ్చని.

నా చేతికి మంచినీళ్లందించి, లోపలకు వెళ్లిపోయిందా సౌందర్య లతిక. భయంకరంగా ఆవులించుకుంటూ.

బ్రతికించింది.

"ఇప్పటికయినా చెప్పరా బుచ్చీ నన్ను చంపక" అన్నాను — వాడి చేతులు నా చేతుల్లోకి తీసుకుని, బ్రతిమలాడుతూ.

"చెబ్తాను" అన్నాడు అభయమిస్తూ.

లోపల గదిలో ఆఖరి పిల్లకాబోలు, నిద్రలో వులిక్కిపాటుకి ఏడుపు లంకించుకుంది తార స్థాయిన. నా గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. ఇంక ఒక్కొక్క పిల్లే లేస్తుంది. నలుగురూ కలిసి నా మీదకు దండయాత్రకు ...

"ముందు బయటకుపోదాం పద" అంటూ వాడిని బలవంతంగా, కాంపౌండులోకి లాక్కు పోయాను.

"ఊఁ ... ఇప్పుడు చెప్పు."

"ఏం లేదురా — అటు చూడు" అన్నాడు పెరట్లోని వాటావైపు చూపిస్తూ.

చూసాను.

"ఏముందక్కడ ?" అన్నాను అర్థంగాక.

"ఆ వాటాలో ఒక చెట్టుక్రింద ప్లీడరు, అతని పెళ్లాం వుంటున్నారు అద్దెకి. అద్దె రెండువందలిస్తున్నాడు. పెంచుతానంటే ఒప్పుకోడు. పోనీ, ఖాళీ చేయమంటే చేయడు."

"ఎన్నిగదుల వాటా అదీ ?"

"రెండు."

"రెండు గదులకి రెండు వందలకంటే ఎవడిస్తాడ్రా నీకు — ఇంతోటి సుందరభవనానికి? గొడవ చెయ్యక వూరుకో."

"ఏడిశావులేవోయ్, తనది కాకపోతే చార్మినార్ వరకు డేకమన్నాట్ట. ఈ హైద్రాబాద్‌లో, ఈ ఏరియాలో మూడొందలు ఈజీగా వస్తాయి. మూడు సంవత్సరాలనుంచి

విద్యానికేతన్
విద్యాసాంస్కృతికమాసపత్రిక

మొదటిసంవత్సరం
ఇంటర్మీడియెట్ చదివే విద్యార్థుల కోసం 1982-83 విద్యాసంవత్సరంలో విడుదలయిన విద్యానికేతన్ (వీటిలో ఇంగ్లీషు, ఫిజిక్స్, కెమిస్ట్రీ మాథమాటిక్స్, బాటనీ, జువాలజీ యివ్వబడినవి) 5 సంచికల విలువ రూ॥ 17-50లు (స్టాకు ఉన్నంతవరకుమాత్రమే).
పైకం పంపవలసిన చిరునామా: VIJAYAVANI PUBLISHERS, CHOWDEPALLE-517 257, CHITTOOR Dt. A.P.

* * * * * * * * *

పాఠశాల
విద్యాసాంస్కృతికమాసపత్రిక

పదవతరగతి చదివే విద్యార్థులకోసం నెలనెలా మేము వెలువరించే 'పాఠశాల' పత్రిక ...
విడిప్రతి వెల: రూ॥ 2-50
సంవత్సర చందా: 25-00, పాఠశాల 1983 జూన్ నుండి 1984 మార్చి వరకు విడుదలవుతుంది. అక్టోబర్ 10వ తేదిలోగా చందా పంపినవారికి 'తెలుగు-ఇంగ్లీషు డిక్షనరీ' ఉచితంగా యివ్వబడుతుంది. ఉచిత కానుక డిసెంబరు నెలాఖరులోగా పంపబడుతుంది. చందాపైకం M.O. పంపాల్సిన చిరునామా: PATASALA, CHOWDEPALLE-517 257 CHITTOOR Dt. A.P.

* * * * * * * *

మాబడి
విద్యాసాంస్కృతికమాసపత్రిక

ఏడవతరగతి చదివే విద్యార్థులకోసం నెలనెలా మేము వెలువరించే 'మాబడి' పత్రిక...
విడిప్రతి వెల: రూ॥ 2-00, సంవత్సర చందా: రూ॥ 20-00
మాబడి 1983 జూన్ నుండి 1984 మార్చినెలవరకు విడుదలవుతుంది. అక్టోబరు 10వ తేదీలోగా చందా పంపినవారికి 'తెలుగు-ఇంగ్లీషు డిక్షనరీ' ఉచితంగా యివ్వబడుతుంది. ఉచిత కానుక డిసెంబరు నెలాఖరులోగా పంపబడుతుంది. చందాపైకం M.O. పంపాల్సిన చిరునామా: MAABADI
CHOWDEPALLE-517 257
CHITTOOR Dt. A.P.

* * * * * * *

ఏజెన్సీ వివరాలకు: మార్గదర్శి మార్కెటింగ్ (ప్రై) లిమిటెడ్, శ్రీనిధు కాంపౌండ్, సోమాజిగూడ, హైదరాబాద్-4.

nani...



రెండొందలే యిస్తున్నాడు."

"అద్దె పెంచడానికి ఒప్పుకోవడం లేదన్న బాధ తప్పితే, ఇతరత్రా అతగాడు నిన్ను వేరే బాధలేం పెట్టడం లేదు కదా ?"

"ఇంకేం బాధలు కావాలి — ధన మూలం మిదం జగత్ అన్నారోయ్. రేపు ఫస్టు నుంచీ ఆ వాటాకి నాకు మూడొందలు రావాలి. ఈ విషయంలో నీ సాయం కావాలి. చేస్తావా చెయ్యవా ?"

"నన్నేం చెయ్యమంటావు ?"

"అది నాకు తెలిస్తే, ప్రొద్దున్నుంచీ నిన్ను మేపడం ఎందుకు ?"

చచ్చేంరా దేవుడా ! సాయం చెయ్యకపోతే ఇప్పుడు నన్ను కక్కమంటాడు కాబోలు తిన్న దంతా. లేకపోతే పెళ్లాం పిల్లల్ని లేపి, నా మీదకు వుసిగొల్పినా వుసిగొల్పుతాడు.

ఆలోచనలో పడ్డాను. బుర్రకి ఏమీ తట్టడం లేదు. అన్ని విధానాల్లోనూ వీడు అతన్తో డీల్ చేసి, ఫెయిల్ అయ్యాకే నామీద ఖర్చు పెట్టి వుంటాడు. వీడు వెధవ గానీ, అతగాడు వెధవ కాక పోవచ్చుగా — నేనెళ్లి వీడి తరపున దబాయించి మాటాడితే, అతగాడు తన లాయరు తెలివితేటలతో నన్నొక స్టుపిడ్ ఆఫ్ గూస్‌ని చేయొచ్చు, ఏం చెయ్యాలి ?

"నాకొంచెం టైం కావాల్రా" అన్నాను చివరకి.

"ప్రొద్దున్న వరకూ టైము ఇస్తున్నాను. రాత్రంతా నిద్రపోకు. ఆలోచించు. ఎ ఫ్రెండ్ ఇన్ నీడ్ ఈజె ఫ్రెండ్ ఇండీడ్ అన్నారు. మర్చిపోకు."

"మర్చిపోను. నీ తిండిమీద, సినిమామీద ఒట్టు."

"అదీ— గుడ్‌బాయ్ లక్షణం." అంటూండగానే వాడి కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. "నీకు తెలియదురా ఎంతగా బెంగపెట్టుకు పోయానో— వీడి మొహం మండా అన్నీ లా పాయింట్లు చెప్పి, కొట్టి పారేస్తున్నాడు. నెలకి వందరూపాయలు లాస్ అంటే మాటలుట్రా" వాడి గొంతు బొంగురు పోయింది.

నాకు ఒళ్ళు మండింది. అభయమిస్తూనే తిట్టాను, "వాడి విషయం నేన్చూస్తాను గానీ, మరీ అంత ఆడదానిలా ఏడిచెయ్యకురా, వెధవ ఏడుపూ. అవునూ — ఆ వాటా ప్రక్కనున్న గుమ్మం ఏవిటీ ?" అన్నాను రెండడుగులు అటువేసి.

"అది ప్రస్తుతం ఖాళీగా వుంది. సెక్రటేరియట్ ఎంప్లాయీ వుండేవాడందులో. క్వార్టర్సు దొరికాయట వెళ్లిపోయాడు."

"అయితే ప్రస్తుతం ఖాళీయేనన్నమాట. అయితే ఇంకేం. దొరికింది అయిడియా."

"ఏవిటీ ?"

"చెబ్తా — నడు నాతో."

* * *

"ఇది చింతలబస్తీ యను పురంబు..."

"ఇక్కడి కెందుకొచ్చాం మనం ?"

"ఇచట గలడు కత్తుల యాదగిరి యనబడు వస్తాదు."

"వస్తాదా ? మా లాయరుగాడ్ని తన్నమని వీడికి పురమాయిద్దామంటావా ? కొంపలు ముంచేస్తావురేయ్. ఆ లాయరు ప్రాణమయినా యిస్తాడుగానీ, ఇటువంటి వస్తాదులకీ, రౌడీలకీ లొంగడు."

"అదికాదులేవోయ్ — 'పొగపెడితే చాలదా, పొమ్మనాలా' అన్నార్రా వెర్రినాగన్నా మన పెద్దలు."

"అంటే... ?"

"చెబ్తానుగానీ, ఓ నెల్లాళ్ళు ఇప్పుడు ఖాళీగా వున్న వాటాకి అద్దె రాకపోతే మరేం ఫర్వాలేదుగా ?"

"ఊఁ... ?"

"ఒక్క నెల్లాళ్ళు ఓర్చుకోరా. లేకపోతే ఒంటిపూట భోజనాలు చెయ్యి. వీలయితే అదీ మానెయ్యి. కానీ ప్లాను నెరవేరాలంటే ఒక నెల్లాళ్ళ అద్దె తీసుకోకుండా కత్తుల యాదగిరికి ఆ వాటా నువ్వు యివ్వాలి."

"ఇస్తే ?!"

"ఇస్తే ఏముందిరా వెర్రినాగన్నా. నీ పాచిక పారినట్టే — పొమ్మనకుండా పొగపెట్టడమన్న మాట. నెల తిరక్కుండా మీ లాయరు గూడు మార్చకపోతే — నా కర్లింగ్ క్రాపు నున్నగా గీయించుకుంటాను. సరా ?"

"సరే"

* * *

"ఈవాళ బిల్లు నేనే ఇస్తా. సినిమా, డిన్నరూ... పో — కొట్టావు ఛాన్సు" అన్నాడు బుచ్చిరెడ్డి — సరిగ్గా నెల తిరిగాక.

"ఏం మన ప్లాను నెరవేరిందా ? మీ కోర్టు పక్షి ఎగిరిపోయిందా ?"

"ఆహా — దివ్యంగా"

"అదీ — చెప్పొగా"

"కొట్టలేదు, తిట్టలేదు, గొప్ప ట్రబులిచ్చేశాడులేరా మన కత్తుల యాదగిరి లాయరు దంపతులకి. ప్రతి పనికీ అడ్డే. ఉక్కిరిబిక్కిరి చేసి ఊదరగొట్టిపారేశాడు. అందుకనే మరో నెల్లాళ్ళు, సరయిన వాళ్లొచ్చేదాకా ఫ్రీగానే వుండమన్నాను వాడిని."

"నీకూ కృతజ్ఞత తెలుసన్నమాట."

"ఏడిశావులేవోయ్"

* * *

మరో నెల తిరిగింది —

"చచ్చానోయ్" అన్నాడు బుచ్చిరెడ్డి, తలుపులు దభాలున తీసుకునివచ్చి, నాముందుపడి.

"ఏవయింది— మళ్లీ ఏవొచ్చింది ?"

"చంపావు నన్ను."

"నేనా ?!!"

"నువ్వే. సాక్షాత్తూ నువ్వేరా నాయనా. నా కొంప నిలువునా ముంచావు."

"విషయం చెప్పకుండా ఏవిట్రాయిదీ ?"

"ఏం చెప్పమంటావు. ఎలా చెప్పమంటావు? ఆ దిక్కుమాలిన కత్తుల యాదగిరిగాడ్ని నా నెత్తిమీద పెట్టావు. వాడిప్పుడు ఇల్లు ఖాళీ చేయనంటున్నాడ్రా తండ్రోయ్. పైగా ప్రక్క వాటా కూడా ఆక్రమించుకున్నాడ్రా నాయనోయ్. అందులో పేకాట క్లబ్బు పెడతా ట్రా బాబోయ్..."

"... ... ... ...???"

"ఈ విషయంలో ఇంక ఏం గొడవ చేసినా మక్కెలు విరిచేస్తానంటున్నాడ్రోయ్ దేవుడోయ్"

"... ... ... ...???"

"కోర్టుకేసొచ్చినా మరేం ఫర్వాలేదు— నువ్వు మాత్రం ఇల్లు ఖాళీచేయొద్దు. నేనున్నాను నీకు అండ అని ఆ లాయరుగాడే వీడికి ధైర్యం చెప్పున్నాట్రా తండ్రోయ్..."

"... ... ... ...?!!!"

—చాలాసేపటి వరకూ బుచ్చిరెడ్డి ఏడుపు నా చెవులకు వినబడుతూనే వుంది గానీ... ఎంత ప్రయత్నించినా కనురెప్పలు వాల్చలేకపోయాను... మనిషిని కదలలేక పోయాను. బహుశా మెదడు మొద్దుబారి పోవటమంటే ఇదే కాబోలు. ★

# జోహార్, లాల్ బహదూర్ !

లాల్ బహదూర్ ! లాల్ బహదూర్ !
ఇదిగో, వెచ్చని జోహార్ !

గనగన మండే ధైర్యం
నీ రూపం తాల్చిందట.
పిడుగుపడ్డ ఈ దేశం
నీ చలవన బ్రతికిందట,
ఒళ్ళు పొంగి 'శాంతివనం'
రా రమ్మని పిలిచిందట.
లాల్ బహదూర్ ! లాల్ బహదూర్ !
ఇదిగో, వెచ్చని జోహార్ !

జాతిని నిర్మించేందుకు,
శాంతిని వెల్గించేందుకు,
జీవితమే వెచ్చించిన
యుగపురుషుని వారసునిగ —

కల్లోలం, కాపట్యం,
యుద్ధాగ్నులు, రక్తాశ్రులు.
ఆకలి వ్యథ, చీకట్లూ
ముప్పిరిగొని ముంచెత్తిన
మూగ కోత రోజుల్లో—

"జై జవాన్ ! జై కిసాన్ !"
అన్న సింహగర్జనతో
ఇంతింతై, మరి అంతై,
అంతంతై అగ్గలించి,
దేశానికి రక్ష కట్టి,
దౌష్ట్యానికి శిక్ష వేసి, ధరిత్రినే
నవతరించావ్ !
భవిష్యమే నిలబెట్టావ్ !
లాల్ బహదూర్ ! లాల్ బహదూర్ !
ఇదిగో, వెచ్చని జోహార్ !

ధర్మానికి బాసటగా
మర ఫిరంగి మండించీ,
నరహింసకు కరిగిపోయి
కన్నీరే నిండించీ,
'తాష్కెంటు'కు దారి తీసి
గౌరవాల కలం దూసి
శాంతి వీలునామాపై
సాక్షి సంతకం చేసి,
మనస్సు మాత్రం మాకిచ్చావ్.
వయస్సు మాత్రం జమకట్టావ్ !
లాల్ బహదూర్ ! లాల్ బహదూర్ !
ఇదిగో, వెచ్చని జోహార్ !

నిరీక్షలో, పరీక్షలో
నిప్పుల కుంపటిగా మారిన
వర్తమాన జీవితాన్ని
వరించుకున్న మాకు —

సామాన్యుడి ప్రతినిధిగా,
వెనుదిరుగని వీరుడిగా,
మనోబలాల మేరువుగా,
క్రియాచరణ శిఖరంగా.

నువు చూపిన కర్తవ్యం,
నువు రేపిన క్షాత్రవ్యం,

చితాభస్మ రూపంగా,
స్మారకాల దీపంగా
ప్రసాదించి పోవయ్యా !
అదే మాకు ఋణమయ్యా !
లాల్ బహదూర్ ! లాల్ బహదూర్ !
ఇదిగో, వెచ్చని జోహార్ !

— జగ్గయ్య

ఆంధ్ర సచిత్ర వారపత్రిక 1966 జనవరి 21 సంచిక నుంచి